నమస్తే తెలంగాణ
# పెద్దపల్లి
5 | కరీంనగర్, శుక్రవారం 23 ఆగస్టు 2024 | PEDDAPALLI


జగిత్యాలరూరల్: ధర్నాలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్సీ ఎల్ రమణ, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, నాయకులు


వేములవాడ: ధర్నాలో పాల్గొన్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మీనరసింహారావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి


ముస్తాబాద్: మాజీ ఎంపీపీ జనగామ శరత్‌రావును లాక్కెళ్తున్న పోలీసులు



కరీంనగర్: ధర్నాలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నగరాధ్యక్షుడు చల్ల హరిశంకర్, చిత్రంలో జిల్లా అధ్యక్షుడు జీవీఆర్, మేయర్ సునీల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు, నాయకులు


కరీంనగర్: ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్


హుజూరాబాద్: బీఆర్ఎస్ నాయకులను డీసీఎం వ్యానులో తరలిస్తున్న పోలీసులు



## రుణమాఫీ కోసం
# బీఆర్ఎస్ రణం

- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుతో పోరుబాట
- కాంగ్రెస్ సర్కారు ధోఖాపై కన్నెర్ర
- రైతులతో కలిసి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిరసనలు
- నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు
- పలు మండల కేంద్రాల్లోనూ ఆందోళనలు
- పాల్గొన్న మాజీ మంత్రి కొప్పుల, మాజీ ఎంపీ వినోద్, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు
- రైతులందరికీ రుణమాఫీ చేయాలంటూ వినతులు
- సర్కారు దిగివచ్చే వరకూ ఉద్యమిస్తామని హెచ్చరిక

## రైతులకు అండగా గులాబీదళం

**రైతన్న కోసం బీఆర్ఎస్ మరోసారి పోరుబాట పట్టింది. రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ సర్కారు ధోఖాపై భగ్గుమన్నది. ఈ నెల 15లోగా ఏకకాలంలో రైతులందరికీ రూ. 2లక్షల రుణమాఫీ చేస్తామని ఆశచూపి, తీరా అనేక కొర్రీలతో వేలాది మందికి మొండిచేయ్యి చూపడంపై ఆగ్రహించింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిరసనలతో హోరెత్తించింది. వందలాదిగా తరలివచ్చిన రైతులతో కలిసి నియోజకవర్గ కేంద్రాల్లో భారీ ధర్నాలు చేసింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శించింది. ఎలాంటి షరతులు లేకుండా మాఫీ చేయాలని, లేకుంటే ఊరుకునేది లేదని స్పష్టం చేసింది. రైతుల కోసం ఎంతకైనా తెగిస్తామని, సర్కారు దిగొచ్చే వరకు ఉద్యమిస్తామని హెచ్చరించింది.**


**- పెద్దపల్లి, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ)**

పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గకేంద్రం ప్రధాన చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. రైతులు, నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించి, ప్లకార్డులు ప్రదర్శించారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పాల్గొన్నారు. షరతులు లేకుండా రుణమాఫీ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. ఆగస్టు 15లోగా రైతులకు వంద శాతం రుణమాఫీ చేస్తామని దేవుళ్లపై ఒట్టేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వం రైతులను, ప్రజలను, ఆ దేవుళ్లను మోసం చేసిందని మండిపడ్డారు. గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులతో కలిసి ధర్నా చేశారు. వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి తమ పోలీసు సిబ్బందితో ధర్నాను భగ్నం చేయడాన్ని ప్రయత్నించగా, పోలీసులతో కోరుకంటి చందర్ వాగ్వాదానికి దిగారు. దీంతో పోలీసులు వెనక్కి తగ్గగా, తెలంగాణ తల్లి విగ్రహానికి చందర్ పాలాభిషేకం చేశారు. రైతులందరికీ రుణమాఫీ చేయాల్సిందేనని, లేదంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రాజీవ్ రహదారిపై పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి భారీ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు రుణమాఫీ కాక ఆందోళన చెందుతున్నారని, బ్యాంకులు, రైతు వేదికల చుట్టూ తిరుగుతూ పడరాని పాట్లు పడుతున్నారని ఆవేదన చెందారు. అన్నం పెట్టే అన్నదాతను ఆగం చేయడం సరికాదని హితవు పలికారు. నిజంగా ప్రభుత్వానికి రైతులపై ప్రేముంటే ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేసి చిత్తశుద్ధిని చాటుకోవాలని సూచించారు. అలాగే ధర్మపురిలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, కరీంనగర్, మానకొండూర్‌లో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ పాల్గొని, ప్రభుత్వ తీరును ఎండగట్టారు.


మంథని: రాస్తారోకో చేస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధూకర్, బీఆర్ఎస్ నాయకులు


కోరుట్ల: ధర్నాలో తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు


గోదావరిఖని: ప్రధాన చౌరస్తా ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్


ధర్మపురి: ధర్నాలో పాల్గొన్న నాయకులు, రైతులు, మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్


## షరతుల్లేకుండా ఇవ్వాలి

**మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్**



ధర్మపురి, ఆగస్టు 22: 'ఎలాంటి షరతుల్లేకుండా పంట రుణాలు మాఫీ చేయాలి. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలి' అంటూ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఓట్ల కోసం ఆచరణ సాధ్యం కానీ వాగ్దానాలు చేసి ఇప్పుడు రైతాంగాన్ని మోసం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే కాంగ్రెస్ నాయకులను ప్రజాక్షేత్రంలో నిలదీస్తామని హెచ్చరించారు. గురువారం నియోజకవర్గకేంద్రం ధర్మపురిలో నిర్వహించిన ధర్నాలో పాల్గొన్నారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రైతుధర్నాలో పాల్గొని మాట్లాడారు. ఆగస్టు 15లోగా పంట రుణాలను మాఫీ చేస్తామని దేవుళ్లపై ఒట్టేసి చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి, అరకొరగా మాఫీ చేసి అటు దేవుడికి, ఇటు రైతులకు శఠగోపం పెట్టాడని మండిపడ్డారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి గద్దెనెక్కిన ఆయన ఇప్పుడు కేసీఆర్, కేటీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నాడని విమర్శించారు. మంత్రులు తలోతీరున మాట్లాడుతూ ప్రజాపాలన అంటే ఇదేనంటున్నారని ఎద్దేవా చేశారు.


పెద్దపల్లి: రాజీవ్ రహదారిపై ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు



సిరిసిల్ల టౌన్: చంద్రంపేట చౌరస్తాలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, నాయకులు

## రాజన్న ఆలయంలో ఏసీబీ సోదాలు

- అధికారుల అక్రమాలపై ఫిర్యాదులతో రంగంలోకి అధికారులు
- వివిధ విభాగాల్లో ఆకస్మికంగా తనిఖీలు
- సరుకుల శాంపిళ్ల సేకరణ
- వివరాలు వెల్లడించిన ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి


ఆలయ గోదాంలో సోదాలు నిర్వహిస్తున్న ఏసీబీ అధికారులు

వేములవాడ టౌన్, ఆగస్టు 22 : దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీపార్వతీ రాజరాజేశ్వరస్వామివారి ఆలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు గురువారం ఆకస్మికంగా సోదాలు చేశారు. రాజన్న ఆలయంలోని ప్రధాన విభాగాల్లో కొద్ది రోజులుగా అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు. ఏసీబీ రేంజ్ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో తూనికలు, కొలతలు, ఆడిట్ శాఖలకు చెందిన అధికారులు సమగ్ర విచారణ చేపట్టారు. దాదాపు 10 గంటలపాటు వివిధ విభాగాల్లో తనిఖీలు చేశారు. గోదాంలో సరుకుల శాంపిళ్లను, లడ్డూ, పులిహోర ప్రసాదాల తయారీలో వినియోగిస్తున్న సరుకుల శాంపిళ్లను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి మాట్లాడుతూ, అవినీతి అక్రమాలు జరుగుతున్నాయనే ఫిర్యాదుల మేరకు ఈ సోదాలు చేశామని తెలిపారు. నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని చెప్పారు. ఈ సోదాల్లో ఏసీబీ సీఐలు కృష్ణకుమార్, తిరుపతి, ఏసీబీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఓవర్ లోడ్ బస్సు నడపలేను

**హుజూరాబాద్ నడిరోడ్డుపై నిలిపేసిన ఆర్టీసీ డ్రైవర్**


బస్సును నడపలేని స్థితిలో నడిరోడ్డుపై నిలిపివేసిన డ్రైవర్

హుజూరాబాద్ టౌన్, ఆగస్టు 22: సామర్థ్యానికి మించి ప్రయాణికులు ఎక్కడంతో బస్సు నడుపడం ఇబ్బందవుతుందంటూ ఓ డ్రైవర్ నడిరోడ్డుపై నిలిపివేశాడు. వివరాల ప్రకారం.. గురువారం సిరిసిల్ల డిపోకు చెందిన బస్సు వరంగల్ వెళ్తుండగా, హుజూరాబాద్ బస్టాండ్‌లో ప్రయాణికులు పెద్ద సంఖ్యలో బస్సు ఎక్కారు. డ్రైవర్ ఎంత చెప్పినా వినకుండా ప్రయాణికులు బస్సు దిగకపోవడంతో చేసేదేమిలేక ఓవర్ లోడ్‌తోనే బస్సును బయటకు తీసుకెళ్లాడు. సైడ్ వ్యూ మిర్రర్లలో పక్కనుంచి వచ్చే వాహనాలు కనపడకపోవడంతో, ప్రమాదాలు జరిగే ప్రమాదముందని బస్సును నడిరోడ్డుపైనే నిలిపివేశాడు. ఇలా అయితే బస్సును నడపలేనంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రయాణికులు సహకరిస్తేనే బస్సు ముందుకు కదులుతుందని తెగేసి చెప్పాడు. ఎట్టకేలకు ప్రయాణికులు సహకరించడంతో బస్సు ముందుకు కదిలింది. సరిపడా సర్వీసులు నడపకపోవడంతో ఇలాంటి పరిస్థితులు వస్తున్నాయని, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడడం సరికాదని ప్రయాణికులు ఆగ్రహించారు. ఈ బస్సు కాకపోతే, ఇంకో బస్సు ఎప్పుడు వస్తదో తెలియదని, వచ్చినా ఎంత రద్దీ ఉంటుందోనని తప్పని పరిస్థితుల్లో ప్రయాణాలు చేస్తున్నారు.

## నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల రూరల్, ఆగస్టు 22: జిల్లాలో బీసీ నిరుద్యోగ యువతకు ఉపాధి నైపుణ్య శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సాయిబాబా ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగలవారు tgbestudycircle.cgg.gov.in లో ఈ నెల 24లోగా అప్లయ్ చేసుకోవాలన్నారు. హైదరాబాద్‌లోని కుషాయిగూడలో ఎలీ హోప్ టెక్నికల్ స్కిల్స్ అకాడమీ ఆధ్వర్యంలో 100 మంది అభ్యర్థులకు 90 రోజుల పాటు నాన్ రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ కాలం తర్వాత అకాడమీ వారే ఉద్యోగాలు కల్పిస్తారని తెలిపారు. శిక్షణ కాలంలో ఒక్కో అభ్యర్థికి నెలకు రూ.4 వేల చొప్పున భృతిని సంస్థ అందిస్తుందన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన 18 నుంచి 25 ఏళ్ల వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పదో తరగతి మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుందన్నారు. కుటుంబ వార్షికాదాయం రూ.5 లక్షల లోపు ఉండాలన్నారు. వివరాలకు 0878-2268686లో సంప్రదించాలని సూచించారు.

## తల్లడిల్లిన మూగజీవి

- బస్సు ఢీకొని లేగదూడ మృతి
- పరుగుపరుగున వచ్చి కళేబరాన్ని తడుముతూ ఆవు కంటతడి
- పెద్దపల్లి జిల్లా అడవిశ్రీరాంపూర్‌లో ఘటన


బస్సుకింద పడి మృతిచెందిన లేగదూడను దీనంగా తడుముతున్న తల్లి ఆవు

ముత్తారం, ఆగస్టు 22: కండ్ల ముందే తన లేగదూడ ఆర్టీసీ బస్సు ఢీకొని మరణించింది. సమీపంలోనే ఉన్న తల్లి ఆవు పరుగుపరుగున వచ్చి తన బిడ్డ (దూడ) కళేబరాన్ని విషణ్ణవదనంతో తడుముతుండడాన్ని చూసిన ప్రతి ఒక్కరీ హృదయాన్ని కలిచివేసింది. మూగజీవి మాతృప్రేమకు అద్దం పట్టిన ఈ ఘటన పెద్దపల్లి జిల్లా అడవిశ్రీరాంపూర్‌లో గురువారం జరిగింది. మంథని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గురువారం అడవిశ్రీరాంపూర్ నుంచి మంథనికి వెళ్తున్నది. ఈ క్రమంలో బస్టాండ్ వద్ద డ్రైవర్ బస్సును రివర్స్ తీస్తుండగా ప్రమాదవశాత్తూ వెనుకన ఉన్న లేగదూడను ఢీకొట్టగా అక్కడికక్కడే మరణించింది. సమీపంలోనే ఉన్న తల్లి ఆవు అక్కడికి చేరుకొని కంట పెడుతూ తల్లడిల్లింది. బిడ్డను లేపేందుకు యత్నిస్తున్న దృశ్యం ప్రతిఒక్కరినీ కంటతడిపెట్టించింది. కాగా, స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న రైతు రత్న పోశాలు అక్కడికి చేరుకొని విలపించాడు.